

గతేడాది కురిసిన వర్షాలకు ఇళ్లల్లోకి చేరిన వరద నీరు

కట్టు కాల్వల కబ్జా

● కాల్వల్లో వెలసిన విల్లాలు ● చెరువులను తలపిస్తున్న రోడ్లు ● పట్టించుకోని అధికారులు



కట్టు కాల్వ కబ్జాతో 2024తొలకరి జల్లులకు బహదూర్‌పల్లి ప్రధాన రోడ్డుపై చేరిన వర్షపు నీరు



కట్టుకాలువ కబ్జాకు గురి కావడంతో ప్రధాన రోడ్డుపై పూడుకుపోయిన పైపులైన్



సుభాష్‌నగర్: చెరువులను అనుసంధానం చేస్తూ వర్షపునీటిని నింపడంలో కీలకపాత్ర పోషిస్తున్న కట్టు కాల్వలు కనిపించకుండా పోయాయి. కబ్జా దారుల బరితెగించి ఆక్రమించుకొని విల్లాలు నిర్మించుకున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి బొబకాన్ చెరువు పెద్ద తూము నుంచి వెళ్లే కాల్వ కబ్జాకు గురైంది.

బహదూర్‌పల్లిలో 37 ఎకరాల విస్తీర్ణంలో బొబకాన్ చెరువు ఉంది. చెరువు దిగువ భాగాన రెండు తూముల నుంచి కట్టుకాల్వ ద్వారా వ్యవసాయానికి రైతులు ఉపయోగించుకునేవారు. క్రమేణా నగరం విస్తరించడంతో సదరు పంట పొలాల్లో ప్లాట్లు వెలిశాయి. కొందరు కట్టు కాల్వను కలిపి వేసుకుని ప్లాట్ చేసి ప్రస్తుతం అక్కడ శ్రీరామ అయోధ్య పేరిట విల్లాల నిర్మాణాలు చేపట్టారు.

వర్షం పడినప్పుడల్లా...

కట్టు కాల్వ కబ్జాతో వర్షం పడినప్పుడల్లా దిగువ ప్రాంతానికి నీరు వెళ్లేందుకు మార్గం లేక వర్షపు నీరు శ్రీరామ అయోధ్య విల్లాల్లోకి రావడమే కాకుండా, బహదూర్‌పల్లి, దూలపల్లి ప్రధాన రోడ్డు పైకి వచ్చి చేరుతుంది. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వర్షపు నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు మార్గం లేక ఇళ్లలోకి వచ్చి చేరాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు అన్న చందంగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు అక్కడికి వచ్చి 17 గుంటల మేర కట్టు కాల్వ కబ్జాకు గురైందని తెల్చి చెప్పారు. మళ్లీ వర్షాకాలం వచ్చేసింది. జూన్‌లో కురిసిన తొలకరి జల్లుకే ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు చేరి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కానీ సంబంధిత అధికారులు మాత్రం ఏమీపట్ట నట్లుగా వ్యవహరిస్తున్నారు.

దూలపల్లి మాదిరిగా చేస్తే...

కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని తుమార్ చెరువు దిగువ భాగాన కట్టు కాల్వ కబ్జా విషయమై గత నెల జూన్‌లో 'సాక్షి'లో వరస కథనాలను ఇచ్చింది. దీనికితోడుగా కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా కలిసి నాలుగు జేసీబీల సాయంతో కట్టు కాల్వపై వెలసిన నిర్మాణాలను తొలగించారు. బహదురుపల్లిలో కట్టు కాల్వపై వెలిసిన నిర్మాణాలను తొలగిస్తే భవిష్యత్తులో వరదగండం ఉండదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం



మందులను పంపిణీచేస్తున్న కౌన్సిలర్ శంకర్‌నాయక్

దుండిగల్: నిరుపేదల కోసం ఉచితంగా వైద్యసేవలను నిర్వహించడం అభినందనీయమని కౌన్సిలర్ శంకర్‌నాయక్ అన్నారు. మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో దుండిగల్ తండాలో శనివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. శంకర్‌నాయక్ ముఖ్యఅతిథిగా హజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. తండా ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళామండలి నాయకులు శాంతా, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

ఎస్‌సీటీసీ ప్లాంట్ పరిశీలన



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులోని ఎస్‌సీటీసీ ప్లాంట్‌ను కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ శనివారం పరిశీలించారు. ఆలస్యం చేయకుండా సమయానికి డంప్ యార్డ్‌కు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, కాలనీలలో చెత్తను కూడా ఎక్కువ సమయం నిల్వ ఉంచొద్దనిని ఎస్ఎఫ్ఏలకు సూచనలు ఇచ్చారు. జోనల్ కమిషనర్‌తోపాటు డీసీ ఎస్‌డబ్ల్యూఎం మోహన్ రెడ్డి, గాజులరామారం డీసీ మల్లారెడ్డి పాల్గొన్నారు.

నగరాభివృద్ధిని గాలికొదిలేసిన సర్కారు: ఎమ్మెల్యే



వివేకానంద్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను చేర్చుకోవడానికి ఇస్తున్న ప్రాధాన్యత స్థానిక సమస్యలను పరిష్కరించడంలో చూపడంలేదని ఎద్దేవా చేశారు. గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉండటంతో నగరాభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. తెలంగాణకు హైదరాబాద్ గుండెకాయ లాంటిదని, మహానగర అభివృద్ధిని విస్మరిస్తే దాని ప్రభావం రాష్ట్రం అంతటిపై ఉంటుందన్నారు. గ్రేటర్ పరిధిలో కనీస మెజార్టీ లేకుండానే అప్రజాస్వామికంగా మేయర్, డిప్యూటీ మేయర్లను పార్టీలోకి చేర్చుకుని రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు సాంప్రదాయానికి తెర లేపిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం రాజకీయాలను పక్కకు పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలని, లేకుంటే రానున్న రోజుల్లో అన్ని వేదికలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

ప్రారంభమైన పీజీ ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ఎనిమిది వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ఓయూ క్యాంపస్‌లోని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో ఉదయం రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి ఎకనామిక్స్ ప్రశ్నపత్రం కోడ్‌ను పారంభించారు. తొలిరోజు ఎంఏ తెలుగు, ఎకనామిక్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, డాటా సైన్స్ కోర్సుల ప్రవేశ పరీక్షలకు 87.17 శాతం మంది హాజరైనట్లు టీఎస్ సీపీజీఈటీ–2024 కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. నేడు జరగాల్సిన ఎంఈడీ ప్రవేశ పరీక్షను 16కు వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో సహాయక బృందాలు రెడీ



ఈశ్వర్ విల్లాస్‌లో కాలనీ ప్రజలతో సమావేశమైన కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతకొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని ఈశ్వర్ విల్లాస్‌లో కాలనీ వాసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. వరదనీరు చేరకుండా కార్పొరేషన్ అధికారులు మాన్‌సూన్ సిబ్బందిని నియమించారని, సమాచారం అందిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, సురేష్ రెడ్డి, మహిపాల్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్ల ఆధునీకరణకు చర్యలు



నిజాంపేట్ 28, 29 డివిజన్లలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ రామకృష్ణ

నిజాంపేట్: డ్రైనేజీ లైన్ల ఆధునీకరణకు చర్యలు చేపట్టనున్నామని నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 28, 29 డివిజన్లలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్‌రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడంతో శనివారం స్థానికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాత డ్రైనేజీ లైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో డ్రైనేజీ సమస్య ఉత్పన్నమవుతోందని, త్వరలోనే టెండర్లు పిలిచి కొత్త పైపులైన్ వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నివాళి



షాపూర్‌నగర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రాంతాల్లో ఘనంగా నివాళులర్పించారు.షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు మేకల నగేష్, నిజాంపేట సాయినగర్‌లో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ నివాళులర్పించారు.

ప్రత్యేక పూజలు

నిజాంపేట్: ఆషాఢ మాస వారాహి నవరాత్రులను పురస్కరించుకుని శనివారం నిజాంపేట్‌లోని కనకదుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త కొలన్ తేజశ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పది రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో వారాహి అమ్మవారి మూలమంత్రహోమాన్ని నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో గ్రామపెద్ద కొలన్ నరసింహా రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ గుడి హుండీలో చోరీ



షాపూర్‌నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం

జీడిమెట్ల: నల్లపోచమ్మ ఆలయంలో దొంగలు పడి హుండీతాళం పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.మల్లేష్ వివరాల ప్రకారం... షాపూర్‌నగర్ ప్రధాన కూడలిలో నల్లపోచమ్మ ఆలయం ఉంది. శుక్రవారం రాత్రి రోజు మాదిరిగా నిర్వాహకులు ఆలయ తలుపులు మూసి తాళం వేసి ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వాచ్‌మెన్ హన్మంతు వచ్చి చూసేసరికి గుడి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా హుండీతాళం పగులగొట్టి ఉంది. అందులో ఉన్న నగదు కనిపించలేదు. స్థానికులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమరాల ఆధారంగా దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

రెండు రాజ్యాంగాలను ఆనాడే వ్యతిరేకించారు..

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఈటల నివాళి



కొంపల్లి నార్త్ సిటీలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: దేశానికి రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలను ఆనాడే డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వ్యతిరేకించారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జన్ సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అమ్మకు ఒక మొక్క కార్యక్రమాన్ని శనివారం కొంపల్లి మున్సిపల్ నార్త్ సిటీ కాలనీలో బీజేపీ కో కన్వీనర్ శివాజీరాజు, జిల్లా ప్రధానకార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఈటల రాజేందర్, జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డిలు ముందుగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ ఆర్టికల్ 370ను ప్రవేశపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం జమ్ము, కశ్మీర్‌ను దేశ ప్రజలకు దూరం చేసిందని, 72 సంవత్సరాల క్రితమే శ్యామా ప్రసాద్‌ముఖర్జీ దీన్ని వ్యతిరేకించారన్నారు. ఆర్టికల్ 370కు వ్యతిరేకంగా ఆయన పోరాడితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జైలులో నిర్బంధించిందని, జైలులోనే ఆయన తుదిశ్వాస విడిచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతల్‌లో శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

చింతల్: భారత జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని శనివారం చింతల్‌లో బీజేపీ నేత కొట్టె సదానంద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి అర్పించి.. మొక్కలు నాటి..

నిజాంపేట్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లో రచ్చ చక్రధర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కన్వీనర్ శేఖర్ యాదవ్, పార్లమెంట్ కో కన్వీనర్ రాజు,నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ కార్యదర్శి బిక్షపతి యాదవ్, నాయకులు అశోక్, సుబ్బారావు, పద్మ ప్రసాద్, సచిన్, బాబూ చౌదరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొట్టె సదానంద్



నిజాంపేట్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మేకల రాములు

నిజాంపేట్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల ప్రజలు శనివారం డిప్యూటీ మేయర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ధన్‌రాజ్ యాదవ్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ తమ కుమార్తె వివాహ వేడుకను రావాలని కోరుతూ డిప్యూటీ మేయర్‌కు వివాహ పత్రికను అందజేశారు.

ప్రత్యేక పూజలు



ఆలయంలో వారాహి అమ్మవారు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిదిలోని సీసాల బస్తీలోని వారాహి అమ్మవారికి ఆషాఢ మాసం పురస్కరించుకొని మొదటిరోజు ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ తదితర పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ జగన్ తోపాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంబిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్‌లో 10 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు . స్థానికంగా ఎటువంటి సమస్యలు ఉన్నా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నేతి శంకర్ గుప్తా, జనరల్ సెక్రటరీ గణేష్, ట్రెజరర్ ప్రసాద్, వెంకట్ రెడ్డి దత్తాత్రేయ, పరమేష్ సంగమేష్ శివకుమార్ రమేష్ వెంకటస్వామి శ్రీనివాస్ రెడ్డి, పాపి రెడ్డి రామస్వామి శేఖర్, మరియు కమిటీ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

చాక్లెట్ దినోత్సవం



చాక్లెట్ డేలో సందడి చేస్తున్న బచ్‌పన్ ప్లేస్కూల్ చిన్నారులు

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బచ్పన్ ప్లే స్కూల్‌లో శనివారం ప్రపంచ చాక్లెట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో చాక్లెట్ల పుట్టు పూర్వోత్తరాలు, వివిధ రకాల చాక్లెట్ల గురించి చిన్నారులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వివిధ రకాల కృత్రిమ చాక్లెట్లు తయారు చేసి ప్రదర్శించారు.

కృత్రిమ నాలా పనుల పరిశీలన



ఓక్షిత ఎన్‌క్లేవ్‌లో నాలా పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లో రూ.20 కోట్ల వ్యయంతో జరుగుతున్న కృత్రిమ నాలా పనులను శనివారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్థానికులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ వెంట జోనల్ ఎస్ఇ చిన్నారెడ్డి, సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి, ఈఈ కిష్టప్ప, డీఈ రూపాదేవి, ఏఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ రెడ్డిలు ఉన్నారు.

జరిగిందేదో జరిగింది...

◆ నాలా పనులను పరిశీలించడానికి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ వచ్చారని తెలుసుకున్న కాలనీవాసులు అక్కడికి చేరుకున్నారు. కబ్జాకు గురైన నాలాను వదిలిపెట్టి, తమ ఇళ్ల మధ్య నుంచి నిర్మిస్తున్నారని, మొదట్లో మీటర్ వెడల్పుతో చేపడతామన్న నాలా పనులను రెండున్నర మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. జరిగిందేదో జరిగిపోయిందని, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని బదులు ఇచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు.

మత్తులో వాహనాలు నడిపితే చర్యలు



సుచిత్ర చౌరస్తాలో బ్రీతింగ్ ఎనలైజ్ పరీక్ష చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. శనివారం పీఎస్ పరిధిలోని సుచిత్ర చౌరస్తా, పేట్ బషీరాబాద్, కొంపల్లి-దూలపల్లి చౌరస్తా, బొల్లారం చౌరస్తాల్లో ఆల్వాల్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ బస్సుల డ్రైవర్లకు బ్రీతింగ్ ఎనలైజ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా వరకు రోడ్డు ప్రమాదాలు మద్యం సేవించి వాహనాలు నడపడంతోనే చోటు చేసుకుంటున్నాయని అన్నారు.

ఏబీవీపీ కొంపల్లి నగర కమిటీ ఎన్నిక

కుత్బుల్లాపూర్: ఏబీవీపీ కొంపల్లి నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కొంపల్లి నగర అధ్యక్షులుగా శ్రీకాంత్, కార్యదర్శిగా నాగేంద్ర ఎన్నుకున్నారు. అనంతరం మేడ్చల్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్ నాగేష్ మాట్లాడుతూ ఈ సంస్థలో పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్త సమాజం, విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు ధర్నాలు అనేక రకమైన కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. ప్రతి ఒక్కరూ దేశం కోసం పనిచేయాలని కోరారు.

టీఆర్ఎస్‌కేవీ ఘనవిజయం



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ముద్దాపురం మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: బాలానగర్ ఇండస్ట్రీ ఏరియాలోని బయోకెమికల్ సింథటిక్ ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శనివారం జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్‌కేవీ ఘనవిజయం సాధించింది. టీఆర్ఎస్‌కేవీ నుంచి ముద్దాపురం మదన్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ నుంచి రాములు నాయక్ పోటీపడ్డారు. మొత్తం 61 ఓట్లల్లో మదన్‌గౌడ్‌కు 42, రాములు నాయక్‌కు 19 ఓట్లు రాగా మదన్‌గౌడ్ 23 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ కార్మికులకు అండగా ఉంటానని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.